# నల్లగొండ జిల్లా బంజారా ఆడశిశుహత్యలు అమ్మకాలు - ఒక పరిశీలన

డా॥ సూర్యాధనంజయ్

## I. ఉపక్రమం

భారత దేశంలో ఆడశిశువు వివక్షకు గురైనంతగా మరెవరు కాలేదన్నది సత్యం. ఆడశిశువులు తల్లికడుపులో ఉన్నప్పటి నుండి ప్రతి దశలోను నిరాదరణకు గురౌతున్నారు.పుట్టడం, బతుకు సాగించడమే గాక సామాజిక వివక్ష నుండి కాపాడుకోవడం ప్రతి ఆడ శిశువు యొక్క జన్మ హక్కు. భారత రాజ్యంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం అందరికి జీవించే హక్కును కల్పించారు. కాని ఆడ శిశువులు మాత్రం తమ హక్కును కోల్పోతున్నారు. ఆడ శిశువులకు జీవించే హక్కేకాకుండా మంచి వాతావరణంలో పెరగడం, సామాజిక వివక్ష నుండి రక్షణ పొందడం కూడా రాజ్యాంగ బద్ధంగా సమకూరిన ప్రాథమిక హక్కులుగా పరిగణించాలి. నేడు మనం ఆడ శిశువులకు సరియైన రక్షణ ఇవ్వకపోవడం వల్ల చాలా మంది పుట్టకుండానే భ్రూణహత్యలకు బలౌతున్నారు. ఒక వేళ పుట్టినా, వారు కొద్ది గంటల్లోనే మట్టిలో కలసి పోతున్నారు. బతికి బట్టకట్టే వారిని అదృష్టవంతులుగా భావించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే పురిట్లోనే వారిని అమ్మేయడం జరుగుతుంది. ఆడ పిల్లల్ని చంపడం లేదా వారిని ఇతరులకు అమ్మడం అనే దురాచారం నల్లగొండ జిల్లాలోని బంజారా తెగల్లో ఇటీవలి కాలంలో ఎక్కువగా ప్రబలినట్లు కనిపిస్తుంది.

బంజారాలది ఒక విలక్షణమైన జీవన విధానం. వీరు ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో తప్పా మిగతా ప్రాంతాల్లో వ్యాపించి ఉన్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం గిరిజనుల సంఖ్య దాదాపు 50,24,104. ఈ జనాభాలో బంజారాల సంఖ్య సుమారు 20,77,947 అంటే రాష్ట్రంలోని మొత్తం గిరిజన జనాభాలో 44.4% బంజారాలున్నారు. 1981-2001 వరకు అందుబాటులో ఉన్న అధికారిక జనాభా గణాంకాలను పరిశీలిస్తే ఒక ఆశ్చర్యకరమైన విషయం వెలుగుచూసింది. గత మూడు దశాబ్దాల కాలంలో బంజారా జనాభాలోని పురుషుల నిష్పత్తి కంటే స్త్రీల నిష్పత్తి అనూహ్యంగా పడిపోయింది. ఈ నిష్పత్తి తగ్గడానికి ముఖ్యకారణమేమిటని అన్వేషిస్తే, 1981-2001 మధ్యకాలంలో ఈ సామాజిక వర్గంలో ఆడ శిశువుల అమ్మకాలు మరియు హత్యలవల్ల స్త్రీల సంఖ్య తగ్గుతున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఒక దేశంలోని జనాభా సమూహంలో స్త్రీల నిష్పత్తి తగ్గడం అనేది ఆందోళన చెందాల్సిన విషయం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగినట్లైతే ఇది సమాజం సమతుల్యతకు ఆటంకంగా మారే ప్రమాదముంది.

కనుక ఈ పరిస్థితికి గల కారణాలను శాస్త్రీయ బద్ధంగా పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ప్రభుత్వానికి ఉంది. ఈ సమస్యను వివిధ కోణాల్లో చర్చించి, నివారణోపాయాలను సూచించడం వ్యాసం యొక్క లక్ష్యం.

## II. చారిత్రక నేపథ్యం

ఆడశిశువులను అంతమొందించే వికృత అనాగరిక చర్య మన సమాజంలో పూర్వం నుంచి ఉన్నదే. ఆడ శిశువును పూర్వం రెండు రకాలుగా చంపేవారని తెలుస్తుంది. పుట్టగానే మత్తుపదార్థాలిచ్చి చంపడం ఒకటైతే, బొడ్డుపేగును నోట్లో వేసి చంపడం మరొకటి. అయితే గిరిజన తెగకు చెందిన బంజారాలు కూడా నేడు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడం దురదృష్టకరం.

సంచార జీవనం కల్గిన లంబాడీలు మొఘలుల కాలంలో సైనిక స్థావరాలకు ఆహార సామాగ్రి చేరవేస్తూ భారత దేశంలోని దక్షిణ భాగానికి వచ్చారు. ఆ రోజుల్లో వారికి వేల కొలది పశువులుండేవి. పశువుల మూపులపైన సుగంధ ద్రవ్యాలు, ఉప్పు ఇతర సామాగ్రిలను చేరవేసేవారు. ఆ కాలంలో బంజారాలు నమ్మకంగా పనిచేసినందుకు గోల్కొండ నవాబు "అసఫ్‌ఖాన్" భగవాన్‌దాస్ వడ్త్యా, జంగీ భంగీభూక్యాలకు ఇచ్చిన ఫర్మానానే ఒక నిదర్శనం. అయితే క్రమక్రమంగా బ్రిటీషుకాలానికి వచ్చేసరికి వీరి వస్తు మారక వృత్తి సన్నగిల్లింది. ఉన్నపళంగా వృత్తిలో వచ్చిన ఆటంకాన్ని తట్టుకోలేక లంబాడీలు చాలా కష్టాలను ఎదుర్కొన్నారు.వీరు సంచార జాతికి చెందినవాళ్ళు కావడం వల్ల, వీరికి భూముల మీద యాజమాన్యపు హక్కులేకపోవడం వల్ల వ్యవసాయం చేసుకోలేకపోయారు. ముఖ్యంగా అడవిలో కట్టెలమ్ముకొని జీవనాన్ని సాగించేవారు కొందరైతే, సారా తయారు చేసి అమ్మేవారు కొందరు వారిలో కొందరు జీవనం దుర్భరమై దొంగతనాలకు కూడా పాల్పడిన సందర్భాతను ఆసరాగా చేసుకొని బంజారాలను బ్రిటీషువారు "క్రిమినల్ ట్రైబ్స్" గా గుర్తించారు. The Criminal Tribes Act. of 1971 (CTA) ప్రకారం పోలీసులు వీరిపై దొంగతనాలను, దోపిడి నేరాలు పెట్టి హింసలకు గురిచేసేవారు. తెలంగాణలోని నిజాం పాలనలో బ్రిటీషు కొలోనియల్ రూల్స్‌ని పాటించమని ఆంగ్ల ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీనితో ఒకప్పుడు రాజుల వద్ద ఫత్వాలందుకొన్న బంజారాలే దొంగలుగా పరిగణించబడ్డారు. భారత స్వాతంత్ర్యానంతరం వారి జీవన స్థితిగతులు ఆగమ్యగోచరంగా మారాయి. రాను రాను అడవులను నరికి, వ్యవసాయ జీవనాన్ని ఎంచుకొని ఎక్కడివారక్కడ స్థిర నివాసాలు ఏర్పరచుకున్నారు.

బంజారాలు కాలానుగుణంగా వచ్చిన మార్పులను తట్టుకొని స్థిరనివాసాలైతే ఏర్పరచుకున్నారు. కాని, వారికి వ్యవసాయ భూములు లేకపోవడం వల్ల కూలీలుగాను, జీతగాళ్ళగాను, గృహనిర్మాణ కార్మికులుగాను తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. మన రాష్ట్రంలో బంజారాలు వరంగల్ జిల్లా తర్వాత నల్లగొండ జిల్లాలోనే ఎక్కువగా ఉన్నారు. అవిభాజిత దేవరకొండ, భువనగిరి,సూర్యాపేట, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ తాలూకాల్లో బంజారాలు అధిక సంఖ్యలో ఉన్నారు. జిల్లాలోని గిరిజన జనాభాలో వీరు 93.66% ఉన్నారు. వీరిలో దాదాపు 95% బంజారాలు దారిద్ర్యరేఖకు దిగువన తమ జీవనాన్ని సాగిస్తున్నారు. కటిక దరిద్రులైన లంబాడీలు ఆడపిల్లల్ని అమ్మడమో, చంపడమో చేస్తున్నారు. ఈ అనాగరిక చర్యకు పేదరికమే కారణమని తెలుస్తుంది.

## III. గణాంకాలే నిదర్శనం :

గత మూడు దశాబ్దాల కాలంలో ఆడశిశువుల అమ్మకాలు పెరిగాయి. ముఖ్యంగా దేవరకొండ ప్రాంతంలో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నప్పటికి కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. ఆడ శిశువుల హత్యలు, అమ్మకాలు ఎంత నిరాటంకంగా జరుగుతున్నాయో గణాంకాల్లో మనకు తెలుస్తుంది. 1981కి పూర్వం తెగల్లో స్త్రీ పురుష నిష్పత్తి జాతీయ సగటుకు దగ్గర్లో ఉండేది. అది కాస్త 1981-2001 మధ్యకాలంలో 927/1000కి చేరింది. యూనిసెఫ్ 1995వ సంవత్సరంలో ఈ విషయాన్ని గుర్తించి స్త్రీ పురుష నిష్పత్తి కొన్ని సామాజిక వర్గాల్లో తగ్గడాన్ని సమాజంలో స్త్రీల పట్ల ఉన్న చిన్నచూపుకు నిదర్శనంగా పేర్కొనడం జరిగింది. ఈ పరిస్థితి నుండి ఆయా సామాజిక వర్గాల స్థితి గతులను మెరుగుపరచవలసిన అవసరం ఉందని పేర్కొన్నది.

బంజారాల్లో స్త్రీల జనాభా తగ్గడానికి గల కారణాలను శాస్త్రీయపరంగా పరిశోధించిన తగిన చర్యలను తీసుకోవాలసిన అవసరం ఎంతైనా ఉంది. 1981లో నల్లగొండ జిల్లాలోని బంజారాల్లో స్త్రీ పురుష నిష్పత్తి 944/1000 ఉండేది. అది 2001 నాటికి 921/1000కి చేరింది. ముందు ముందు ఇదే పరిస్థితి కొనసాగినట్లైతే నల్లగొండ జిల్లా బంజారా స్త్రీల జనాభా గణనీయంగా తగ్గే ప్రమాదముంది. మన దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఈ సమస్య ఉంది కాని ఇంత తీవ్రంగా ఎక్కడా లేదని చెప్పవచ్చు.

పి.ఎం. నాయర్ ప్రభుత్వానికి సమర్పించిన జాతీయ మానవహక్కుల కమీషన్ (NHRC) ప్రాజెక్ట్ రిపోర్ట్ 2001-2003 ప్రకారం, నల్లగొండ జిల్లాలోని బంజారాల్లో ఆడశిశువుల అమ్మకాలు చాలా జరుగుతున్నట్లు తేలింది. కడుపేదరికం వల్లనే ఇలా జరుగుతుందని రిపోర్టులు తేల్చి చెప్పాయి. ఘోరమైన పేదరికం వల్ల బంజారా సమాజం అభివృద్ధి చెందకపోగా, ఆడశిశువుల అమ్మకాలు జరుగుతున్నాయని పి.ఎం. నాయర్ పేర్కొన్నారు. ఆడపిల్లల్ని కొనుగోలు చేసే మధ్యదళారీలు, దత్తత ఏజన్సీలు కొంత మంది స్థానిక వ్యక్తులను పురిగొల్పి లంబాడీల ఆడపిల్లలను దత్తత ఉచ్చులోకి లాగుతున్నారు. బంజారాల పేదరికాన్ని ఆసరాచేసుకొని మానసికంగా వారిని అమ్మకాలకు సంసిద్ధులుగా చేస్తున్నారు. ముఖ్యంగా ఆరోగ్య కేంద్రాలైన ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో పని చేసే సిబ్బంది ద్వారా ఈ రాకెట్లు దత్తత ఏజన్సీలుగా పనిచేస్తున్నట్లు అన్వేషణలో తేలింది. సాధారణమైన దత్తత సూత్రాలకు విరుద్ధంగా దళారీలు లంబాడీల పిల్లల్ని కొనుగోలు చేసి సమాజానికి నష్టం చేస్తున్నారు. ముఖ్యంగా ఇలాంటి దళారీలను శిక్షించడానికి ప్రభుత్వపరంగా పటిష్టమైన చట్టాలు లేకపోవడం వల్ల ఈ దుశ్చర్యలకు పాల్పడడం జరుగుతుంది.

మన దేశంలో స్త్రీ పురుష నిష్పత్తిని పరిశీలించినట్లైతే, రాను రాను స్త్రీల జనాభా తగ్గుతూ వస్తుందని గణాంకాల వల్ల తెలుస్తుంది. 1901-2001 వరకు గల జనాభా లెక్కలను పరిగణిస్తే గణాంకాలు ఈ విధంగా చెప్తున్నాయి.

| సంవత్సరం | స్త్రీ, పురుష నిష్పత్తి (పు/స్త్రీ) |
|---|---|
| 1901 | 1000/927 |
| 1951 | 1000/946 |
| 1991 | 1000/945 |
| 2001 | 1000/927 |

2000 ల సంవత్సరంలో జరిగిన ఒక సర్వేలో మన దేశంలో ఆడపిల్లల హత్యలు గణనీయంగా పెరిగినాయి. ఎక్కువగా శిశుహత్యలు మధ్యప్రదేశ్‌లో 29.8% అయితే మహారాష్ట్రలో 19.2% ఉన్నట్లు తేలింది. తర్వాత వరసలో తమిళనాడు, బీహార్, రాజస్తాన్, ఆంధ్రప్రదేశ్‌లు ఉన్నాయి.

అభివృద్ధి చెందిన దేశాల్లో స్త్రీ పురుష నిష్పత్తి పరిశీలించినట్లైతే ప్రతి 106 మంది స్త్రీలకు 100 మంది పురుషులున్నారు. ఆఫ్రికాలో 102/100 అయితే దక్షిణతూర్పు ఆశియాదేశాల్లో 101/100 కాని మన దేశంలో మాత్రం 93 మంది స్త్రీలుంటే 100 మంది పురుషులున్నారు. మన దేశంలో 6 నెలల వయస్సుగల ఆడశిశువుల విషయంలో ఈ సంఖ్య ఇంకా దారుణంగా ఉంది. 2001 జనాభా లెక్కల ప్రకారం 6 నెలల వయస్సున్న ఆడపిల్లలు 1000/927 ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే ఆడశిశువుల హత్యలు, అమ్మకాలు ఎక్కువగా గిరిజన తెగల్లో ఉన్నట్లు అధ్యనాల్లో తేలినట్లు ముందే తెలుసుకున్నాం. ముఖ్యంగా బంజారాలు అత్యధికంగా నివసిస్తున్న వరంగల్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో స్త్రీ నిష్పత్తి గణనీయంగా తగ్గుతున్నట్లు తెలుస్తుంది. బంజారాల స్త్రీ పురుషుల సంఖ్యను అధికారికంగా గణాంకాల ద్వారా పరిశీలిస్తే ఆశ్చర్య కరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 1981 నుండి 2001 వరకు ఒక నల్లగొండ జిల్లా గణాంకాలు ఈవిధంగా ఉన్నాయి.

| సంవత్సరం | స్త్రీ, పురుష నిష్పత్తి (పు/స్త్రీ) |
|---|---|
| 1981 | 1000/944 |
| 1991 | 1000/925 |
| 2001 | 1000/921 |

ఈ గణాంకాలను పరిశీలించినట్లైతే బంజారాల్లో స్త్రీ పురుష నిష్పత్తి దేశ సరాసరిసంఖ్య కంటే తక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే బంజార సమాజంలో స్త్రీల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి సామాజిక అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది.

## IV. కారణాలు:

### 1. సమాజిక వివక్ష:

సమాజాభివృద్ధికి కారకులైన ఈ ఆడపిల్లలంటే మన సమాజానికెందుకుకింత చులకన భావం. ఆడవాళ్ళు మగవాళ్ళతో పాటుపెరిగే వాతావరణం, రక్షణ ఎందుకు కల్పించలేకపోతుంది మన సమాజం. స్త్రీలు బాహ్యంగా బలహీనంగా కనపడినా, జన్యుపరంగా పురుషులకంటే బలంగా ఉంటారని వైద్య

శాస్త్రాధ్యయనాలలో తేలింది. అయినా కూడా ఎందుకంత వివక్ష. బంజార సమాజంలో ఒక కావట్ (సామెత) ఉంది. "ఛ్వారా హువలో బోల ఖాంసేర్‌థాళి, ఛ్వారి హువతో ఫోడరిక్రి" అంటే మగపిల్లవాడు పుడితే మట్టికుండను పగులకొట్టి విచారాన్ని వ్యక్తం చేస్తారని భావం. దీన్ని బట్టి బంజారా సమాజంలో ఆడపిల్లల పట్ల ఎంత వివక్ష ఉందో తెలుసుకోవచ్చు. ఇలా ఆపిల్లలపట్ల ఉన్న వివక్షను గుర్తించి "సార్క్" సంస్థ 1990 సంవత్సరాన్ని ఆడశిశువు సం॥రంగా ప్రకటించింది. అలాగే 1991 నుండి 2001 వరకు "సార్క్" ఆడశిశువు దశాబ్ధంగా కూడా ప్రకటించింది. ఆడపిల్లల్ని చిన్నచూపుతో చూడవద్దని వారిని కూడ మగవాళ్ళతో సమానంగా చూడాలని, ఎన్నో రకాల కార్యక్రమాలను చేపట్టింది. అయినా సమాజంలో ఎటువంటి మార్పులేదు.

ఒకవైపు స్త్రీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని బిల్లుపెట్టే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తుంది. కాని అంతకంటె ముందు స్త్రీ పురుష నిష్పత్తిని మెఱుగు పరచడానికి చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతో ఉంది. ఆడశిశువుల హత్యలను, అక్రమ విక్రయాలను అరికట్టవలసిన అవసరం ఉంది. నేటి ఆడ శిశువులే రేపటి సమాజంలో పురుషులకు జన్మనిచ్చే మహిళలు కాబట్టి ఆడశిశువు జీవించే హక్కును ప్రాధాన్యతను ఒక సామాజిక బాధ్యతగా గుర్తించి, తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఆడపిల్లలను చంపడం అంటే భవిష్యత్తులో ఆడవాళ్ళను, మగవాళ్ళను కూడా చంపినట్లే. కాబట్టి ఆడపిల్లలకు పుట్టి పెరగడానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలి ప్రభుత్వం తగిన రక్షణ ఇవ్వాలి.

ఇక బంజారా సమాజ విషయానికొస్తే, వీరు తమ ఆడపిల్లలకు మంచి భవిష్యత్తును ఇవ్వలేమనే భయం ఒకటైతే, వారి పోషణ భారాన్ని మోయలేని దుస్థితి వేరొకటి. ఆడపిల్లల వల్ల వారి వంశం అభివృద్ధి చెందదని కూడ వారికి ఒక దురభిప్రాయం కూడా ఉంది. వీరి సామాజిక, ఆర్థిక స్థితి ఆసరా చేసుకొని దళారీలు, దత్తత ఏజన్సీలు, డబ్బుఎర చూపి కొనుగోలు చేయడం జరుగుతుంది. లంబాడీలు జన్యుపరంగా ఆకర్షణీయమైన శరీర సౌష్టవాన్ని కలిగి ఉండి ఇతరులను ఆకర్షించడం కూడా దీనికి కారణమని చెప్పవచ్చు. ముఖ్యంగా ఇండోఆర్యన్ జాతి లక్షణాలు కల్గి ఉండడం ఇందుకు ఉదాహరణ. బంజారాలలో కొందరు ఆడ శిశువులను చంపలేక డబ్బు ఉన్న వారి దగ్గరుంటే వారికి మంచి జీవితం లభిస్తుందనే ఆశతో అమ్మకాలు సాగిస్తున్నారు. కాని ఇది చాపకింద నీరులాగ మొత్తం జాతినే కబళించే దుశ్చర్యగా మారబోతుంది.

## 2. సంస్కృతి సంప్రదాయాల్లో మార్పులు

బంజారాలు స్వాతంత్ర్యం రాక పూర్వం సంచార జీవనం గడుపుతూ తమ జీవనాన్ని సాగించేవారు. స్వాతంత్ర్యానంతరం వారి జీవన విధానంలో అర్థాంతరంగా వచ్చిన మార్పు వారి సంస్కృతిని చిన్నాభిన్నం చేసింది. తమ చుట్టూ ఉన్న హిందు సమాజ సంస్కృతి యొక్క ప్రభావం వీరి మీద చాలా ఎక్కువగా ఉంది. ఆధునికతకు తోడు వారి వేషభాషల్లోను, సంస్కృతి సంప్రదాయాల్లోను మార్పులు వారికి తెలియకుండానే ఏర్పడుతున్నాయి. బంజారేతర సమాజాన్ని అనుసరించడం జరుగుతుంది. 1978కి పూర్వం తెలంగాణాలో బంజారాలకు ప్రభుత్వ రిజర్వేషన్లు లేవు. తర్వాత రిజర్వేషన్ కల్పించడం జరిగింది. ఇప్పుడిప్పుడే వారి సమాజంలో అక్షరాస్యత శాతం పెరుగుతుంది. కాని ఆధునిక సమాజం వారికి మంచి జీవితాన్ని, ఆర్థిక స్థోమతను కల్పించలేక పోతుంది.

## 3. నిరక్షరాస్యత:

విద్యలేని వారిని సమాజం ఎంత ఇబ్బంది కల్గిస్తుందో వేరే చెప్పక్కరలేదు. చీకటి నుంచి వెలుగులోకి దారి చూపేది విద్య. సమాజంలోని మంచి చెడులను విద్య మాత్రమే వేరుచేయగలదని డా॥ సర్వేపల్లి  అన్నారు. సామాజిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపగలిగేది విద్య మాత్రమేనని నొక్కివక్కాణించారు వివేకానంద. ఈ మేధావులందరు అన్నట్టు జీవించడానికి తిండి ఎంత అవసరమో విద్య కూడా అంతే అవసరం. కాబట్టి చీకటి మూగిన గిరిజనుల వ్యక్తిత్వం వికసించాలన్నా, చైతన్యవంతులు కావాలన్నా విద్య చాలా అవసరం. వారు విద్యను నేర్చుకొని అజ్ఞానం నుండి విజ్ఞానవంతులు కావాలి. అప్పుడే వారు అన్ని సమస్యల నుండి బయట పడ్తారు. అలా విజ్ఞానవంతులు కావాలంటే ప్రభుత్వం చొరవ తీసుకోవలసిందే. ప్రభుత్వం వారు అదిగో, ఇదిగో విద్యాభివృద్ధి అని ఊరిస్తుందే తప్పా, అభివృద్ధి మాత్రం కనుచూపుమేరలో ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యంగా స్త్రీలను విద్యాపరంగా ప్రోత్సహించవలసిన అవసరం ఎంతో ఉంది. నేటికి 90% గిరిజన మహిళలు వ్యవసాయ కూలీలుగాను, పరిశ్రమల్లో కార్మికులుగాను పనిచేస్తున్నారు.

2001 జనాభా లెక్కల ప్రకారం 79.88% మంది స్త్రీలు నిరక్షరాస్యులు. 63 యేండ్ల స్వతంత్ర భారతంలో కేవలం బంజారా స్త్రీలు 20.12% అక్షరాస్యత కలిగి ఉన్నారు. ఇది గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం ఎంతటి నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందో తెలియజేస్తుంది. నిరక్షరాస్యత పేదరికానికి పుట్టినిల్లు. ఆ పేదరికమే వారితో ఆడశిశువుల పట్ల దుశ్చర్యలకు పురిగొల్పుతుంది. ఈ నిరక్షరాస్యతకు తోడ్పాటు

పేదరికం, అమాయకత్వం వీరి తోడైంది.

భారత రాజ్యాంగంలో షెడ్యుల్ తెగలు, కులాలకు రక్షణ కల్పించే అనేకాంశాలు 46వ ఆర్టికల్‌లో పొందుపరచబడ్డాయి. దీనిని అనుసరించి సామాజిక న్యాయం కోసం దేశమంతటా వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు సాధ్యమైనంత ఎక్కువగా నిర్మించాలి. మన ప్రభుత్వ ఉపాధ్యాయులు గిరిజన ప్రాంతాల్లో చదువు చెప్పడానికి విముఖత చూపుతున్నారు. కొండ కోనల్లో నివసించే గిరిజనుల తండాలకి వెళ్ళి పాఠం చెప్పేంత విజ్ఞులు కొందరు మాత్రమే మన సమాజంలో ఉన్నారని నా అభిప్రాయం. ఆడపిల్లల పాఠశాలలకు స్త్రీలనే ఉపాధ్యాయినులుగా నియమించాలి. అప్పుడే వారికి సరైన రక్షణను, విద్యను ఇవ్వగల్గిన వాళ్ళమౌతాం.

## 4. పేదరికం:

రాష్ట్రంలో లంబాడీల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ఆడపిల్లల పెండ్లీలు వారికి సమస్యలుగా మారాయి. వరుస కరువుకు తోడు ఉపాధి పనులు లేకపోవడంతో తండాల్లో ఆడపిల్లల పోషణ భారమైపోయింది. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా, వీరికి చేరకపోవడం ఉన్న ఊళ్ళను వదిలి ఉపాధికోసం పట్నానికి వలసకువెళ్ళడం, అక్కడ మగవాళ్ళు అద్దెరిక్షాలతో కాలం వెళ్ళదీస్తే, ఆడవాళ్ళు పని దొరకక బానిసత్వం, పిల్లల్ని పురిట్లోనే అమ్ముకోవడం లేదా వళ్ళు అమ్ముకోవడం లాంటివి జరుగుతున్నాయి. బంజారాలకు ఉపాధి లేకపోవడం వల్లే కదుపేదరికాన్ని అనుభవిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గిరిజనుల్లోనే ఎక్కువగా ఉంది. కాబట్టి ప్రభుత్వం వారు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి వారి అభివృద్ధికి కృషి చేయాలి. లంబాడీలకు ఉపాధిహామి పథకాల గురించి తెలియజేసే బాధ్యత ప్రభుత్వానిదే. బ్యాంకులు ఎక్కువ వడ్డీకి అప్పులిచ్చినా, మధ్య దళారీల కారణంగా వారికి చేరకపోవడం గమనార్హం. వీరి అమాయకత్వం వల్ల స్థానిక వ్యాపారులు, రాజకీయనాయకులు, గిరిజనేతరుల చేతిలో మోసపోతున్నారు. ప్రభుత్వ సబ్సిడి రుణాలు వారికి అందక ప్రైవేటు వ్యాపారుల దగ్గర అప్పులు చేయడం జరుగుతుంది. వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీని వసూలు చేయడంతో చేతికొచ్చిన పంట రుణానికే ఇచ్చేయవలసివస్తుంది. ఇలా బంజారాలు వడ్డీ వ్యాపారుల చేతిలో మోసపోయి విలవిల కొట్టుకుంటున్నారు. పండీ పండని పంటలతో, అర్థాకలితో, అప్పులతో జీవనం సాగించలేక సామాజిక, ఆర్థిక,అనారోగ్య, రాజకీయ సమస్యలతో సతమతమౌతున్నారు.

ఆడపిల్లలంటే వివక్ష చూపడానికి మరో కారణం మూఢనమ్మకాలు. మగపిల్లవాడు పుడితే వారిని ఉద్ధరించి, వంశోద్ధారకుడౌతాడని వారి నమ్మకం. అందుకే మగపిల్లవాడు పుట్టేవరకు కుటుంబ

నియంత్రణ పాటించకుండా ఆడపిల్ల పుడితే వెంటనే ఎదో ఒక రకంగా వదిలించుకునే ప్రయత్నం చేస్తారు.

కావున ప్రభుత్వం చొరవ తీసుకొని లంబాడీలకు కౌన్సిలింగ్ నిర్వహించి ఆడపిల్లల్ని రక్షించే ప్రయత్నం చేయాలి. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం అందించి బాలికలను మంచి వాతావరణంలో పెరిగే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించాలి.

## 5. లింగ నిర్ధారణ పరీక్షలు

ఆధునిక సాంకేతిక విద్యసమాజంలో మూఢనమ్మకాలను దూరం చేస్తుందని భావించాం కాని, శరవేగంగా పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం అమ్మాయిల పట్ల శాపంగా మారుతుందని ఎవరూ ఊహించలేరు. పుట్టబోయే బిడ్డ ఆడా? మగా అనే విషయాన్ని ముందుగానే స్కానింగ్ ద్వారా తెలుసుకొని అమ్మాయి పుడితే అబార్షన్ పేరుతో పుట్టకముందే చిదిమేస్తున్నారు. ఈ నీచస్థితి సమాజంలో వేళ్ళునుకుపోయింది. ఈ స్కానింగ్ వల్ల మృత్యుంజయురాలిగా భూమి మీద పడ్డా బతికి బట్టకట్టే నమ్మకం లేదు. కావున లింగ నిర్ధారణ పరీక్షలు పూర్తిగా నిషేధించాలి. చట్టవిరుద్ధంగా ఎవరైనా నిర్ధారణ పరీక్షలు చేస్తే వారిని కఠినంగా శిక్షించాలి.

అయితే బంజారా సమాజంలో డబ్బున్న అతికొద్ది మంది మాత్రమే లింగ నిర్ధారణ చేసుకుంటున్నారు. కాని తండాలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో అబ్బాయి పుడితే పెంచుకుంటున్నారు, అమ్మాయి పుడితే చంపడానికి తల్లే నీటి బకెట్‌లో ముంచేస్తుందో, వేడి వేడి సారాచుక్కలు గొంతులో పోస్తుందో, నోట్లో వడ్లగింజ వేస్తుందో, గొంతు నులిమి చంపేసి పాతి పెడుతుందో తెలియని అయోమయ స్థితి కొన్ని తండాల్లో కనిపిస్తుంది. శిశువును చంపేయడం ఆధునిక సమాజంలో మహాదారుణమని చెప్పక తప్పదు. కాబట్టి ప్రభుత్వం వారు అన్ని విధాలుగా వారికి సహాయం అందించినట్లైతే భావితరాలకు ఆడపిల్లల్ని అందించిన వాళ్ళమౌతాం.

## 6. వరకట్న దురాచారం

నాగరిక సమాజంలో పట్టి పీడిస్తున్న మరో సమస్య వరకట్నం. ఈ వరకట్న పిశాచి తండాలను ఆవరించింది. రెండు, మూడు దశాబ్దాల క్రితం వరకు కూడా ఎదురుకట్నం ఇచ్చి ఆడపిల్లల్ని పెళ్ళి చేసుకునేవారు. కాని నేడు లక్షల్లో వరకట్నం అడుగుతున్నారు. లేదంటే మీరు మా కోసం కన్నారా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్య వల్ల కూడా అమ్మాయిల పట్ల తేలిక భావం ఉందని చెప్పవచ్చు.

'పున్నామ నరకం నుండి రక్షించే పుత్రుడుకావాలి కాని, వరకట్న సమస్యల కొలిమి నెత్తిన పెట్టే కూతురు ఉండకూడదని తల్లిదండ్రులు తలుస్తున్నారు. ఆడపిల్లలు, మగపిల్లలు ఒక్కరే అనే భావన ప్రతి తల్లిదండ్రుల్లో వచ్చిన రోజే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

**ముగింపు:**

లంబాడీలకు సహజంగా ఎంత కష్టాన్నైనా భరించగల శక్తి ఉంది. కాని వారికి సమాజం తీరు, సంస్కృతి సంప్రదాయాల్లో మార్పు ఇతరుల చేతుల్లో మోసపోవడం, వరకట్న దురాచారం, మూఢనమ్మకాలు, కరువు, ఉపాధి లేకపోవడం, సామాజిక చైతన్యానికి దూరమవడం లాంటివి ఒక ఎత్తైతే, నిరక్షరాస్యత మొ॥నవి ముఖ్యకారణాలుగా చెప్పవచ్చు. నల్లగొండ జిల్లాలోని అత్యధికులైన బంజారాల సంక్షేమం కోసం, ప్రత్యేకమైన, కట్టుదిట్టమైన పథకాలను రూపొందించి అమలు చేయవలసిన అవసరం ఉంది. కాని జనాభా ప్రతిపధికన నిధులు కేటాయించకుండా అరకొర పథకాలతో కాలం వెళ్ళదీస్తున్న పరిస్థితి మారాలి. మధ్య దళారీల జోక్యాన్ని తగ్గించి, నేరుగా పేద వారికి అందేటట్టు చర్య తీసుకోవలసిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 63 సం॥ పైనా కూడా బంజారాలు ఇంత దుర్భరమైన స్థితిలో ఉన్నారంటే ఇది ప్రభుత్వం వైఫల్యమే అని చెప్పక తప్పదు.

కనీస సౌకర్యాలకు నోచుకోని గిరిజనులు రాష్ట్రంలోని మారుమూల తండాల్లో దుర్భర జీవనాన్ని కొనసాగిస్తున్నారు. తమ బిడ్డల్ని అమ్ముకుంటున్నారు. ఎపుడో ఒకసారి దళారీలు పట్టుబడినపుడు, మీడియాలో కవరయినపుడు మన దృష్టికి వచ్చే సంఘటనలే కాక మరెన్నో సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అందుకే ఈ తెగల్లో ఆడవాళ్ళ శాతం ప్రమాదకర స్థాయికి చేరింది. ఈ విధమైన నిష్పత్తి నల్లగొండ జిల్లాలోనే కాక బంజారాలు అత్యధికంగా నివసించే ఇతర జిల్లాల్లో కూడా తీవ్రంగా ఉన్నదనే విషయాన్ని గమనించాలి. ఈ విషయంలో ఇంకా పూర్తి అధ్యయంన జరిగినట్లైతే ఎన్నో ఆసక్తికరమైన అంశాలు వెల్లడికావచ్చు. కాబట్టి ప్రభుత్వం ఈ విషయంలో చొరవతీసుకొని ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి సమస్యను కూలంకశంగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.